విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

జగనన్న సురక్ష క్యాంపు ఏర్పాట్లు పటిష్ఠంగా జరగాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పగడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈనెల 30 నుండి రాష్ట్రమంతటా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని 45 రోజుల పాటు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. ఈ నెల 25వ తేదీన ప్రతి జిల్లాలోని రెండు ప్రాంతాలలో పైలట్ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి 4 దశలలో ఈ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి అవసరమగు ఆరోగ్య పరీక్షలు చేయడం, మందులు అందించడం, కళ్ళజోళ్ళు ఇవ్వడం, ఆరోగ్యశ్రీ పై అవగాహన కలిగించడం పెద్ద ఎత్తున చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిఎంహెచ్వో డి.మహేశ్వరరావు, డిఎల్‌డిఓ కే సి హెచ్ అప్పారావు, డిఇఓ ఆర్.వెంకటరమణ, ఇన్‌చార్జి డిసిహెచ్ ఎస్‌పి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

15న ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభం

విశాలాంధ్ర-ఏలూరు: నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఈనెల 15 న లాంఛనంగా ప్రారంభించి మొదటి ఏడాది మెడికల్ విద్యార్థులను ఉద్దేశించి సందేశం ఇవ్వనున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి పేర్కొన్నారు. శుక్రవారం ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలను వర్చువల్ గా ముఖ్యమంత్రి విజయనగరం నుంచి లాంఛనంగా ప్రారంభిస్తున్న సందర్భంగా సంబంధిత ఏర్పాట్లను బుధవారం జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పరిశీలించారు. కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులతో ముఖ్యమంత్రి విజయనగరం జిల్లాలో కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని, మిగిలిన జిల్లాల వారితో వర్చువల్ ద్వారా ఆ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన జిల్లాలకు చెందిన వైద్య విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖా ముఖి సంభాషించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నూతనంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్ణీత సమయంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట ప్రిన్సిపల్ కె. విజయకుమార్, ఏలూరు ఆర్డిఓ ఎస్.కె. ఖాజావలి, డియంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ట, నగరపాలక సంస్థ కమిషనరు ఎస్. వెంకటకృష్ణ, ఏలూరు తహశీల్దార్ బి. సోమశేఖర్, ఎపిఎంఎస్ఐడి కో-ఆర్డినేటర్ సునీల్ కుమార్, ఇఇ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఈనెల 19వ తేదీన వినాయక చవితి సందర్భంగా పట్నంలో విగ్రహాల ప్రతిష్టకు మున్సిపాలిటీ, పోలీస్ అధికారులు, అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఒకటవ పట్టణ సిఐ అడబాల శ్రీను అన్నారు. బుధవారం ఆయన ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విగ్రహాలు ప్రతిష్ఠించి ఎన్ని రోజులైతే అన్ని రోజులు దూప దీప నైవేద్యాలు పెట్టడమే కాక వాటి పరిరక్షణ బాధ్యత మండపాలు వేసే వారిదేనన్నారు. ప్రకృతిని కాపాడే విధంగా మట్టి విగ్రహాలనే వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించరాదని, నిమజ్జన సమయంలో విగ్రహాల వెంట డిజెలు, మద్యం సేవించి డాన్సులు వేయడం నిషేధమని పోలీస్ నియమ నిబంధనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని కోరారు.

టి నరసాపురం: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యుల వివరాలు పోలీసు స్టేషన్‌లో తెలియ జేయాలని ఆయన తెలిపారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మండపాల్లో ఏర్పాటు చేసే విగ్రహాల వివరాలు తెలియ జేయాలన్నారు.అగ్ని మాపక,విద్యుత్ అధికారుల అనుమతులు పొందాలని ఆయన తెలిపారు.

ముదినేపల్లి ఈవోపీఆర్డీగా లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి ఈవోపిఆర్డిగా దూలం లక్ష్మీనారాయణ నియమితుల య్యారు. కైకలూరు గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ పదోన్నతిపై ముదినేపల్లిలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఇవోపీఆర్డిగా పనిచేసిన ఎం.విజయసారథి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఎల్ నారాయణను ఏవో రమణ బాబు, గ్రామపంచాయతీ కార్యదర్శులు జి. రమేష్, ఆదిలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

రెవెన్యూ అధికారి తీరుపై ఉన్నతాధికారుల దర్యాప్తు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో పనిచేస్తున్న ఒక గ్రామ రెవెన్యూ అధికారి తీరుపై ప్రజలు, రైతులు ఆగ్రహం చెందుతున్నారని విశాలాంధ్రలో బుధవారం ప్రచురించిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ గ్రామ రెవెన్యూ అధికారి చేస్తున్న ఆగడాలపై దర్యాప్తు చేపట్టారు. దీనికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్టు తెలిసింది.

కొత్త పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-ముదినేపల్లి : మండలంలో కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను గ్రామ సచివాలయాల వద్ద ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు , ఎంపీటీసీ మరీదు నాగయ్య చేతుల మీదగా పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోనే పింఛన్లు అధిక స్థాయిలో పంపిణీ చేశామన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ఈ పంపిణీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-ఏలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, ఐటిడిఎ పివో యం. సూర్యతేజ, డియంహెచ్ఓ డాక్టర్ ఎస్. శర్మిష్ట, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఐసిడిఎస్, విద్యా తదితర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ జగనన్న సురక్ష తరహాలోనే ఆరోగ్య సురక్ష ను కూడా చేపట్టాలన్నారు. ఒక నిర్ణీత రోజున వారికి మంచి జరిగేలా హెల్త్ క్యాంపు నిర్వహించాలన్నారు.ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటిలో జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో ప్రతిఇల్లు కవర్ కావాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే మనముందున్న కర్తవ్యమని అధికారులకు సూచించారు.

ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభించే ఇంటింటి సర్వే ను సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని 27 మండలాలు, యుఎల్ బిసి లతో కలిపి 31 ఉన్నాయని, 477 జగనన్న ఆరోగ్యశ్రీ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు దీనికి 62 బృందాలు ఏర్పాటు చేసినట్లు 104 వాహనాలు 41 కేటాయించినట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో స్పెషలిస్టు డాక్టర్లు 114 మంది, ఇతర స్పెషలిస్టులు 86 మంది, గైకానాలజిస్ట్ 9 మంది, చిన్న పిల్లల డాక్టర్లు 9 మంది, జనరల్ మెడిసన్స్ 9 మందిని, ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లను కేటాయించినట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్స్ 130 మంది, సిహెచ్ఓ లు 463 మంది, ఎఎన్ఎం లు 741 మంది, ఆశ వర్కర్లు 1861 మంది, కోర్ గ్రూప్ ఆఫీసర్స్ 6 గురు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో డిపిఓ టి. విశ్వనాథ్ శ్రీనివాస్, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, డిప్యూటీ డియంహెచ్ఓ నాగేశ్వరరావు, డిఇఓ శ్యామ్ సుందర్, జిఎస్ డబ్ల్యుఎస్ రమణ, ఎస్ సి కార్పోరేషన్ ఇడి కుముదిని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో మానవ విలువలు పెరగాలి

విశాలాంధ్ర-ఏలూరు: విద్యార్థులలో మానవ, నైతిక విలువలు పెంపొందించుకోవాలని విజయవాడకు చెందిన కేబీఎన్ కళాశాల హిందీ అధ్యాపకురాలు జె.జానకి అన్నారు. హిందీ దినోత్సవం సందర్భంగా సర్ సి ఆర్ రెడ్డి కళాశాలలో బుధవారం ఆడియో విజువల్ హాలులో ప్రాచ్యభాషా విభాగం "దోహోమే అభివ్యక్తి మానవమూల్య" అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్త జె. జానకి మాట్లాడుతూ హిందీ సాహిత్యంలో మానవ విలువలు, నైతిక విలువలను ఏ విధంగా పెంపొందిచు కోవాలో హిందీ పద్యాల ద్వారా భావాలతో వివరిస్తూ, విద్యార్థులలో మార్పు రావాలని, మానవ విలువలు పెరగాలని తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎస్.విష్ణుమోహన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ సాహిత్యం గొప్పతనాన్ని వివరించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం వలన ఉపాధితోపాటు, దేశ నలుమూలలకు వెళ్ళినప్పుడు అనేక విషయాలను తెలుసుకోవడంలో హిందీ సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రాచ్య భాషా అధ్యక్షులు డాక్టర్ కెవిఎసిబి ఆచార్య, హిందీ అధ్యాపకురాలు డాక్టర్ కె. సుమిత్ర, సంస్కృత అధ్యాపకులు బి. వినాయకుడు, డాక్టర్ ఎ.రామకృష్ణ , అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - లింగపాలెం : చింతలపూడి ఎత్తిపోతల పథకానికి భూసేకరణ జరిగితే మిగులు భూమిని ఆన్‌లైన్ చేయటానికి సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని లింగపాలెంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ భూములకు సంబంధించిన సబ్ డివిజన్ రికార్డు మండల కేంద్రంలో ఉంచకుండా ప్రత్యేక కలెక్టర్ కార్యాల యంలో ఉంచారని, దీనివల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నా యని పేర్కొన్నారు. మండల కేంద్రంలో భూముల సబ్ డివిజన్ రికార్డులను ఉంచాలని కోరారు. దీనిపై తహశీల్దార్ ఆర్.వి.మురళీ కృష్ణ స్పందిస్తూ ఉన్నతాధికారులకు సమస్యను తెలిపి రికార్డులను అందుబాటులో ఉంచే చర్యలు తీసుకుంటామని అన్నారు. లింగపాలెం మండలంలో ఈ ఏడాది 1095 హెక్టార్లలో పామాయిల్ తోటలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటికి 280 హెక్టార్లకు మొక్కలు పంపిణీ చేశామని ఉద్యానశాఖాధికారిణి షాఫియా ఫర్విన్ తెలిపారు. మూడేళ్ళ నుంచి దరఖాస్తు చేసుకున్న రైతులకు కూడా వీటిని అందిస్తున్నామని అన్నారు. మండలంలో లక్షా 56 వేల మొక్కలకు దరఖాస్తు చేసుకుంటే అందరికీ అందించామని వివరించారు అర్హులుగా ఉండి రైతుభరోసా అందని రైతులు నిరుత్సాహ పడాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా రైతులు వేసిన పంటను ఈ-క్రాప్ చేయించుకోవాలని రైతుభరోసా కేంద్రంలో ఉన్న వ్యవసాయ ఉద్యాన శాఖ సహాయకుల ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు మట్టా సురేష్, కలవపూడి ఝాన్సీరాణి, ఎంపిడిఓ ఆశీర్వాదం, తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15న 'ఎంప్లాయి గ్రీవెన్స్'

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఉద్యోగుల నుండి ఫిర్యాదులు స్వీకరించుటకు " ఎంప్లాయి గ్రీవెన్స్" కార్యక్రమాన్ని ఈ నెల 15వతేది (మూడవ శుక్రవారము) న సాయంత్రం గం. 4 నుండి జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి సంబంధించిన గ్రీవెన్స్‌లు ఏమైనా ఉంటే ఆ గ్రీవెన్సులను దరఖాస్తులో పొందుపరచి తమ సి.ఎఫ్.ఎం.ఎస్. ఐ.డి., ఎంప్లాయి గుర్తింపు నెంబరుతో 'ఎంప్లాయి గ్రీవెన్స్" కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

జగన్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

విశాలాంధ్ర -ఏలూరు: టిడిపి జాతీయ అధ్యక్షులు , మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబుపై అక్రమంగా వైసిపి ప్రభుత్వం కేసులు బనాయించి అరెస్టు చేయడంపై ప్రజాగ్రహానికి గురికాక తప్పదని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా బడేటి చంటి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక వసంత మహల్ సెంటరులో నిరాహార దీక్షలు చేపట్టారు. పోలీసులు దీక్షకు అనుమతి లేదని రిలే దీక్షను భగ్నం చేశారు. అనంతరం బడేటి చంటి తన కార్యకర్తలతో కలిసి చేపల తూము సెంటర్లో దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు పతనం అవుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు బలమైన ఉద్యమం ద్వారా జగన్ రాక్షస పాలనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. ఈ రిలే నిరాహార దీక్షలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ, డిప్యూటీ మాజీ మేయర్ చోడే వెంకటరత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ పూజారి నిరంజన్, మారం అను, మల్లెపు రాము, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

విశాలాంధ్ర-ద్వారకా తిరుమల: జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులతో షెడ్యూల్ ప్రకారం ఈ నెల15వ తేదీ శుక్రవారం ద్వారకా తిరుమల మండలంలో నిర్వహించవలసిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనివార్య కారణాల వాయిదా పడినట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నేడొక ప్రకటన లో తెలిపారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా
రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-తణుకు: తెదేపా జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా తెదేపా తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తణుకు పట్టణంలోని రాజీవ్ చౌక్ సెంటర్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి 14 రోజుల పాటు రిమాండ్ విధించడమే కాకుండా ఆయనపై మరిన్ని అక్రమ కేసులు పెట్టదానికి కుట్ర పన్నడం సిగ్గుచేటు అన్నారు. ఈ దీక్షలకు సిపిఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కోశాధికారి గుబ్బల వెంకటేశ్వరరావు, బొద్దాని మురళీకృష్ణ, బొద్దాని కృష్ణ కిషోర్, నూనె రాధాకృష్ణ తదితరులు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రాష్ట్రంలో జగన్ రెడ్డి రాజ్యాంగం నడుస్తున్నదని విమర్శిం చారు. ఎటువంటి ఆధారాలు లేకున్నా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఈ అక్రమ అరెస్టును సిపిఐ తరపున ఖండిస్తున్నామన్నారు.

తెదేపా రిలే నిరాహార దీక్షకు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: తెదేపా జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టినందుకు నిరసనగా చేపట్టిన తెదేపా రిలే నిరాహార దీక్షకు మద్దతుగా బుధవారం సిపిఐ ప్రతినిధి బృందం సంఘీభావం ప్రకటించింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, జిల్లా సమితి సభ్యులు ఊలింకల జయకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బందారు శ్రీనివాసరావు, కొణతాల నాగరాజు, దిద్దె నాగేశ్వరరావు.గండికోట నాగబాబు సంఘీభావం తెలియజేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ వివక్ష ధోరణి విడనాడాలన్నారు. చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి,గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం పరిమి రవికుమార్,ముత్యాల సత్యనారాయణ, సుబ్బరాజు, సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

మరపురాని కవి ఆచార్య ఆత్రేయ

విశాలాంధ్ర -భీమవరం: మరపురాని కవి ఆచార్య ఆత్రేయ అని పామరులకు సైతం ఆయన అర్ధమయ్యే పాటలు రాశారని ఎ.పి. ప్రజా నాట్య మండలి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ కొనియాడారు. అభ్యుదయ కవి, రచయిత ఆచార్య ఆత్రేయ వర్ధంతి సభ బుధవారం శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరంలో జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ఆత్రేయ మహాకవి శ్రీశ్రీ సమకాలీకులని ఆయన ఎన్నో సినిమా పాటలు, మాటలు సమకూర్చారని, అభ్యుదయ భావాలతో అభ్యుదయ రచయితల సంఘంలో కూడా పనిచేశారని కొనియాడారు. ఆయన లేని లోటు అభ్యుదయ సాహిత్య రంగానికి తీరనిలోటని సీతారాం ప్రసాద్ నివాళులర్పించారు. కార్యక్రమంలో జవ్వాది దాశరధి శ్రీనివాస్, చుక్కాని శ్రీ , శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ప్రజా కళాకారుడు చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ విజయోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: ఆర్ టి సి ఎంప్లాయిస్ యూనియన్‌కు రెండో గుర్తింపు సంఘంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఏడాది పూర్తయిన సందర్భంగా భీమవరం డిపో వద్ద యూనియన్ నాయ కులు, కార్యకర్తలు విజయోత్సవ వేడుకలు బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వి రావు, జోనల్ నాయకులు గోపాల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ 1954లో ఆర్టీసీ ఆవిర్భవించిన తర్వాత ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కార్మికుల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల కోసం వేతన ఒప్పందం చేసి మెరుగైన జీతభత్యాలు సాధించి కార్మికుల హృదయాల్లో చోటు సంపాదించు కుందని అన్నారు. కార్మికుల సంఖ్యాబలం రీత్యా ప్రభుత్వం గుర్తించి గుర్తింపు సంఘంగా కార్మిక సంస్థలు యాజమాన్యంతో మాట్లాడటానికి అవకాశం ఇచ్చిందని వారన్నారు. జోనల్ నాయకులు ఎం ఆర్ పి రాజు, డిపో నాయకులు గుండా సాయి సత్య రాంబాబు, డిపో సెక్రటరీ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింప సంఘంగా ఆవిర్భవించడానికి కార్మికుల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ఆర్. వి.రాజు, యూనియన్ కార్యదర్శి చినమిల్లి శ్రీనివాసరావు,గ్యారేజీ కార్యదర్శి జి.శ్రీనివాస్, డి.వీ.ఎస్.కుమార్, ఎం.నాగార్జునరావు, జి వి ఎస్ నారాయణ, పి.శ్రీనివాసరావు, ఎస్ పి ఎస్ ఏ రావు, కార్మికులు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

విశాలాంధ్ర- ముసునూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో మండల వ్యాప్తంగా పని ప్రదేశంలో నేమ్‌బోర్డులు పెట్టలేదని ఏపిఒ జయప్రసాద్ పై రికవరీ చేయాలని ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆరసవల్లి రాము ఆదేశించారు. బుధవారం ముసునూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.ఏ సత్యనరారాయణ ఆధ్వర్యంలో ఉపాధిపనుల పై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పి.డి ఎ.రాము మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో పని కల్పిస్తే పలుగ్రామాల్లో ఒకరి పనికి మరొకరు రావడం,తల్లి కార్డు పై కుమారుడు పని చేయడం, పనిలో హాజరుకాకపోవడం, మస్టర్లలో సంతకాలు లేకపోవడం, వేలుముద్రలు లేకపోవడం అధికారుల పర్యవేక్షణ లేకుంటే జరిగే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాలకు గాను 770 రకాల పనులు చేయగా,రూ.11కోట్ల 97లక్షల వేతనాలు అందజేసినట్టు తెలుపుతూ, రికవరి రూ.1.46.548లు చేయగా,వాటిలో సుమారు రూ.56వేలు లు పైగా నేమ్‌బోర్డులు రూపంలోనే రికవరి చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన,ఏలూరు జిల్లా విజిలేన్సు అధికారి (డ్వామా) ఏ.వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా క్షేత్రంలో ఘోరీ కడతాం

విశాలాంధ్ర -నూజివీడు : చంద్రబాబు నాయుడును అక్రమంగా జైలుకు పంపించడ్నా నిరసిస్తూ నూజివీడు మండలం మొర్సపూడి గ్రామంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరం వద్ద నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో జగన్‌ను ఇంటికి పంపించేది ఖాయమైనందున లోకేష్ బాబు యువగళం పాదయాత్రకి , చంద్రబాబు నాయుడు పర్యటనకు జనం బ్రహ్మరథం పడుతున్న సందర్భంలోనే జగన్ భయపడి వారి యాత్రలను ఆపేందుకు వారి కార్యకలాపాలకు భంగం కలిగించేందుకు జనాల్ని దారి మరల్చేందుకు ఈ విధంగా అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-యలమంచిలి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు దూసుకు పోతోందని వైసీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి అన్నారు. బుధవారం యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, యలమంచిలి మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, యలమంచిలి మండల ఎంపీపీ రావూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వరికి అధికంగా పురుగు మందులు వాడొద్దు

విశాలాంధ్ర - గణపవరం: వరి పండించే రైతులు వరిలో ఎక్కువగా పురుగు మందుల వాడకం తగ్గించి నాణ్యమైన దిగిబడులను పొందాలని, తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సల హాలు, సూచనలు పాటిం చాలని పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ అధికారి జడ్. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పన్నపేట గ్రామంలో డాక్టర్ వైయస్సార్ గుడ్ ఆగ్రో కల్చరల్ ప్రాక్టీసెస్ (పొలంబడి) కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వరి పంటను ఉత్పత్తిదారుల సంఘం ద్వారా ఎగుమతి చేసుకోవడానికి అనుగుణంగా తయారు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మురళీకృష్ణ, పశు వైద్యాధికారి డాక్టర్ టి. జ్యోతి ,గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్పంచ్ నక్కా సూరి బంగారయ్య, ఎంపీటీసీ కొల్లి సత్యనారాయణ, ఎన్. సుధాకరరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గర పడుతున్నాయని తెదేపా నాయకులు మొడియం సూర్య చంద్రరావు పేర్కొన్నారు. బుధవారం కొయ్యలగూడెం పట్టణంలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన సామూహిక నిరాహార దీక్ష శిబిరంలో పోలవరం నియోజకవర్గ టీ నర్సాపురం మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొడియం సూర్యచంద్రరావు మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబును వైకాపా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా అక్రమంగా అరెస్టు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసరావు, కొయ్యలగూడెం మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-టీ నరసాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసు కుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎం ఆర్ సి కాలనీ వాసులు సిసి రోడ్లు వేయాలని,డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఇంటి బిల్లులు చెల్లించాలని, రేషన్ బియ్యం సక్రమంగా అందేటట్లు చర్యలు చేపట్టాలని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా మంజూరైన పించన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ డి. లక్ష్మి, సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి



విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తల సేమియా భవనంలో పదిమంది తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల సహకారంతో తల సేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 25 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన మానవత సభ్యులు మానేపల్లి సత్యనారాయణ, హేమ సునీత దంపతులకు, పండ్లు స్వీట్స్ పంపిణీ చేసిన సత్యసాయి సేవా సంస్థకు, లయన్స్‌క్లబ్ సభ్యురాలు కె.పద్మావతికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్కే వరప్రసాదరావు, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, రత్నాకర్ రావు, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల వెన్నులో వణుకు

విశాలాంధ్ర-ఏలూరు: జనసేన పార్టీ ఎదుగుదలను చూస్తే అధికార వైకాపా ప్రజాప్రతినిధుల వెన్నులో వణుకు పుడుతోందని జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన జరిగిన తన పుట్టినరోజు వేడుకల సందర్భంగాను, వారాహి యాత్ర విజయవంతం అయ్యిందని తమ కార్యాలయం వద్ద, ఏలూరు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, క్యాలెండర్లు ఏర్పాటు చేశామన్నారు. తన పుట్టినరోజు వేడుకలకు వేలాదిగా ప్రజలు తరలి రావడంతో ఈర్ష్యతో అధికార పార్టీ ఎమ్మెల్యే, మేయర్ కలసి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, క్యాలెండర్లు, తొలగించారన్నారు. వైసీపీ వారివి కూడా తొలగించి నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచాలని అధికారులకు రెడ్డి అప్పలనాయుడు సూచించారు.

నూతనంగా మంజూరైన పించన్లు పంపిణీ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో నూతనంగా మంజూరైన వివిధ రకాల 18 పింఛన్ల ను జెడ్పీటీసీ సభ్యులు పోల్నాటి బాబ్జీ, సర్పంచ్ యడ్లపల్లి రాధిక చేతుల మీదుగా స్థానిక సచివాలయం వద్ద బుధవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జడ్పిటిసి బాబ్జి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సర్పంచ్ రాధిక మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పించన్ లు అందిస్తుందన్నారు. ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వైసీపీ నాయకుల చేతుల మీదుగా వితంతు, కల్లుగీత కార్మికుల పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-వీరవాసరం: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఆర్ఈజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపిడిఓ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యాన్ డేస్ విధానం రద్దు చేయాలని, తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అందరికీ ఎఫ్ఎఇ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత 17 ఏళ్లుగా పని చేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారిని గుర్తించాలని కోరారు. ఎన్ఎంఎంఎస్ యాప్లో సాంకేతిక కారణాల వల్ల చేసిన పనులకు కూలీల హాజరు, పని ప్రదేశాల్లో ఫొటోలు అప్లోడ్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సీనియర్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లు అనే తారతమ్యం లేకుండా అందరిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా కొనసాగించాలని, అర్హత, అనుభవం కలిగిన వారికి ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డు సౌకర్యం కల్పించి, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు అమలు వంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సుదీర్, బాలకృష్ణ, పుష్పారావు, నాగరాజు, పెద్దిరాజు, జివి.సత్యనారాయణ, శ్రీనివాసరావు, టి.సత్యనారాయణ, అనురాధ వెంకటలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం ఈవోపీఆర్డీగా సారథి

విశాలాంధ్ర-వీరవాసరం: వీరవాసరం ఈవోపీఆర్డీగా టివి సారధి బాధ్యతలు స్వీకరించారు. ఈయన ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శిగా చేస్తూ ఉద్యోగోన్నతిపై వీరవాసరం మండల ఈవోపీఆర్డీగా నియమి తులయ్యారు. ఈ సందర్భంగా సారధి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

మండలంలో 336 పెన్షన్లు మంజూరు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా అర్హులైన వారికి కొత్తగా 336 పెన్షన్లు మంజూరు అయ్యాయని జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు బోద శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం పి. రాజవరం గ్రామంలో నూతన పింఛన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు వికలాంగులు వితంతువులు అర్హులైన ప్రతి ఒక్కరికి వైసిపి ప్రభుత్వంలో పింఛన్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. పి రాజవరం పంచాయతీకి నూతనంగా 20 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని అన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ మళ్ళీ జగన్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని అన్నారు.ఈ ప్రభుత్వం అయితేనే తమకు సక్రమంగా పింఛన్లు అందుతాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంతమ్మ, ఉప సర్పంచ్ శ్యామల, శరణ్య, నాయకులు సూరిశెట్టి ఏసుబాబు, తమ్మ మురళీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కొబ్బరి చెట్టు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - పెనుమంట్ర: పెనుమంట్ర మండలం సత్యవరం గ్రామంలో వెలమ పేట రామాలయం చెంతన ఉన్న కొబ్బరి చెట్టు బుధవారం తొలగించారు. సెప్టెంబర్ 9వ తేదీన భయపెడుతున్న కొబ్బరి చెట్టు అనే శీర్షిక తో విశాలాంధ్ర పత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనంతో విద్యుత్ శాఖ, స్థానిక పంచాయతీ, కొబ్బరి చెట్టు యజమాని సుమారు రూ.3500 వెచ్చించి తొలగించారు. కొబ్బరి చెట్టు ప్రమాదకరంగా అత్యంత పొడవుగా ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలపై స్థానిక ప్రజలను భయపెడుతూ కనిపించేదని... విశాలాంధ్ర పత్రిక వారికి స్థానిక గ్రామ ప్రజలు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

విష జ్వరాల నుండి ప్రజలను కాపాడండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలో రోజురోజుకు పెరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న విష జ్వరాల నుండి ప్రజలను కాపాడాలని ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాల ముందు ధర్నా చేసి ఆయా కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆ సంఘాల జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శులు కారం సత్యవతి, కొండా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలతో ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారని అన్నారు. జ్వరాలతో, వివిధ జబ్బులతో వేలేరుపాడు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులకు సరైన మందులు లేక ప్రైవేట్ హాస్పిటల్లో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వెంటనే ఇంటింటికి దోమల మందు కొట్టించాలని, దోమతెరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్కె మున్ని, కోశాధికారి సోయం వసంత, నాయకులు మడివి కన్నమ్మ సున్నం దుర్గమ్మ, గడ్డాల రమణ, మచ్చ సుభద్ర, సున్నం రాణి, పి వై ఎల్ డివిజన్ అధ్యక్షులు కట్టం రాంబాబు, డివిజన్ నాయకులు సోయా రాంబాబు, కారం రాముడు, పి. వీరబాబు, మద్దాల సురేష్, తుర్రం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రోజాపై మాజీ మంత్రి పీతల ఫైర్

విశాలాంధ్ర -పాలకొల్లు: మంత్రి రోజా సవ్యంగా మాట్లాడితే మంచిదని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. బుధవారం చంద్రబాబు రిమాండ్ కు నిరసనగా పాలకొల్లులో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలలో ఆమె పాల్గొన్నారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు ఆత్మహత్య చేసుకునే స్థితిలోకి వెళ్లిన నువ్వు, మంత్రి పదవి వచ్చాక ఆస్తులు ఎలా కూడబెట్టావో తెలుసన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని అన్నారు.

టీడీపీకి పెరగనున్న ఓటు శాతం

విశాలాంధ్ర - పాలకొల్లు: కేవలం కుట్రపూరితంగా మాత్రమే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు జరిగిందని టిడిపి పాలకొల్లు మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ అన్నారు. బుధవారం పాలకొల్లులో టిడిపి నిరసన దీక్షలలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబుకు రిమాండ్ విధించడం అనే అంశం టిడిపికి కలిసొస్తుందన్నారు. రోజుకు 1లక్ష చొప్పున 14 రోజులలో 14 లక్షల ఓటింగ్ టీడీపీకి పెరుగుతుందన్నారు. ప్రజలలో తమ అధినేత చంద్రబాబుకు అన్యాయంగా రిమాండ్ విధించారనే సానుభూతి ఉందన్నారు.

విద్యతో పాటు వృత్తి నైపుణ్యత సాధించాలి

కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: విద్యార్థిదశ నుండే చదువుతో పాటు నైపుణ్యాలను కూడా మెరుగుపరచుకుంటే ఉన్నత స్థానాలను అందిపుచ్చుకోగలరని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక డి.యన్.ఆర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సందర్శించి, కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులు వారి చదువుతోపాటు ఎప్పటికప్పుడు సాఫ్ట్ స్కిల్స్ లేదా ప్రొఫెషనల్ స్కిల్స్‌లో నైపుణ్యాన్ని పొందాల్సిన అవసరం ప్రతీ ఒక్కరికి ఉందని అన్నారు. విద్యార్థులు తమ చదువును ఒక నిరంతర ప్రక్రియగా ఎలా పరిగణిస్తారో ఉద్యోగులు, ఉద్యోగార్థులు కూడా నైపుణ్యాలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని అన్నారు. 10వ తరగతి మొదలుకొని పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివిన విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నందున వారందరూ తమ ప్రాథమిక అర్హత తోపాటు నైపుణ్యాలను అదనపు అర్హతగా చూపి పేరొందిన సంస్థలలో ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఇంత భారీ స్థాయిలో జాబ్ మేళాను ఏర్పాటు చేసినందుకు డి.యన్.ఆర్ కళాశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.యస్.శాంత కుమారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో భారీ స్థాయిలో జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డి.యన్.ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు మాట్లాడుతూ డి.యన్.ఆర్ విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులతో పాటుగా ఇతర విద్యాసంస్థలో చదివిన విద్యార్థులు కూడా వారి వారి అర్హతల మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సామాజిక బాధ్యత గా భావించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. పాలకవర్గ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ డి.యన్.ఆర్ విద్యా సంస్థలలో విద్యార్థులకు కావలసిన వివిధ రకాల నైపుణ్యాలను అందించడానికి తగిన సౌకర్యాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచి ఒక నిరంతర ప్రక్రియగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.కళాశాల పాలక వర్గ ఉపాధ్యక్షులు జి. పాండు రంగరాజు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు సుమారు 22 కంపెనీల నుండి ఎంపిక చేసుకునే ప్రతినిధులు హాజరయ్యారని, ఉద్యోగాల కోసం సుమారు 1200 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేయించుకుని ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేయడంలో డి.యన్.ఆర్. కళాశాల యాజమాన్యం అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. .ఈకార్యక్రమంలో పాలకవర్గ సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, ట్రెజరర్ జి.వి.యస్.ఆర్ నారాయణ, అసిస్టెంట్ సెక్రటరీ కె.శివరామరాజు, పాలకవర్గ సభ్యులు యస్.రామలింగరాజు, దత్తాత్రేయ వర్మ, పి.రామకృష్ణంరాజు, కళాశాల అధ్యాపక, అద్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరుకున్న టీడీపీ రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: తేదేపా అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా టీడీపీ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధ వారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. తెదేపా పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగు తున్నాయి. రెండవ రోజు దీక్షలో పాతూరి అంబేద్కర్, గుళ్ళపూడి శ్రీదేవి, గంటా శ్రీను, చిలపరెడ్డి ఇంద్రాణి, కోనేటి చంటి, రాగాని శ్రీనివాస్, గెడ సుబ్రహ్మణ్యం, కంకి పాటి భద్ర రావు, దండే పద్మ, కన్నా శ్రీదేవి, నాయుడు శ్రీనివాస్, దొమ్మేటి శ్రీనివాస్, కే ఎల్ ఎం ఆనంద్, అద్దేపల్లి రవికుమార్ లకు చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, సాయిల సత్యనారాయణ, పెనుమర్తి రామకుమార్, తూటికుంట రాము,రాజాని సత్యనారాయణ, యాగంటి సుబ్రహ్మణ్యం, చిట్రోజు తాతాజీ, తడికమళ్ళ గోపాలరావు చెరుకూరి శ్రీధర్, చిట్టి బోయిన రామలింగేశ్వర రావు తదితరులు పూల మాలలు వేసి దీక్షశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటా మురళీ రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబుపై గత మూడు రోజులు గా కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. తెదేపా రాష్ట్రకార్యదర్శి దాసరి శ్యాంసుందర్ శేషు మాట్లాడుతూ టిడిపి క్యాడర్ లో మనోధైర్యం కోల్పోయేలా చేయటమే వైసీపీ కుట్ర అనే విషయాన్ని అన్ని వర్గాలకు వివరించేందుకు సిద్ధమవ్వాలన్నారు.ఈ దీక్షా శిబిరాన్ని చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపుముత్తారెడ్డి, బొమ్మాజి అనిల్, సొంగారోషన్ కుమార్, అకుమర్తి రామారావు,మాముడూరి మహంకాళి, లీలా ప్రశాంతి,కామవరపుకోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిలారి సత్యనారాయణ, లింగపాలెం మండల తెలుగుదేశం అధ్యక్షులు పార్టీగరిమెళ్ళ చలపతిరావు, చింతలపూడి రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోటూరి వెంకటరామయ్య, కామవరపు కోట మాజీ జడ్పిటిసి గంటా సుధీర్ బాబు, చింతలపూడి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు జంగారెడ్డిగూడెం పట్టణ రూరల్ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో సంఖ్యలో వచ్చి సంఘీభావం ప్రకటించారు.

భీమవరంలో:

చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా భీమవరంలో టిడిపి శ్రేణులు నిరాహార దీక్షలు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ జగన్‌కు దమ్ము ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలోకి రావాలన్నారు. దీక్షా శిబిరాన్ని జనసేన రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు కనకరాజు సూరి సందర్శించి సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్ట్ తో జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉండి ఎమ్మెల్యే రామరాజు దీక్షా శిబిరాన్ని సందర్శించి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు కార్యక్రమాల్లో జనసేన నాయకులు చెనమల్ల చంద్రశేఖర్, సుంకర రవి, మోకా శ్రీనివాస్, మాగాపు ప్రసాద్ రామాయణం, శ్రీనివాస్ దారపురెడ్డి, త్రివిక్రమ్ నాగిడి శ్రీనివాస్, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముసునూరులో :

మండల కేంద్రమైన ముసు నూరు మండపం సెంటర్ వద్ద రిలే నిరహార దీక్షలు చేపట్టగా,ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, గద్దె రఘుబాబు, అట్లూరి రవీంద్ర, కొల్లి గంగరా మ్, మెదరమెట్ల సురేంద్ర, చిలుకూరి వెంకటేశ్వరరావు, కందుల పిచ్చియ్య, కాటేపల్లి ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, గద్దల మోహనరావు, పులిబళ్ల లక్ష్మిసత్యనారాయణ,రాపర్ల ప్రతాప్, గూడపాటి ఆజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ భరోసాతో నూతన ఉత్సాహం



విశాలాంధ్ర-చాట్రాయి: తెదేపా అధినేత చంద్రబాబు రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ రంగ ప్రవేశం చేసి భరోసా ఇవ్వడంతో పార్టీలో ఉత్సాహం నిండు కుందని జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో తెదేపాకి ఇటీవల వస్తున్న ప్రజాదరణను చూసి భయభ్రాంతులకు గురై కుట్రపన్ని రిమాండ్ కి పంపించారని అన్నారు. తెలుగుదేశం పార్టీని ఓడించాలన్న వారి కలలు అడియాశలు అవక తప్పదన్నారు.

చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి



విశాలాంధ్ర - నిడదవోలు : రుజువులు,సాక్ష్యాలు లేకుండా అక్రమంగా అరెస్టు చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ చౌక్ సెంటర్లో బుధవారం సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగాదీక్ష లో పాల్గొన్న కుందుల సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై కక్ష సాధింపు లో భాగంగానే అక్రమ కేసు బనాయించారన్నారు. దీక్షలో పేరూ రి సాయిబాబు,అంబటి వెంకటరమణ, మద్దుకూరి రాధా, కే.సత్య నారాయణ, జీ. శ్రీనివాసరావు, గోవిందరావు, బాబు, తెలుగుదేశం నాయకులు పాల్గొనగా జనసేనపార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.

బాబుకు తోడుగా రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర - జగ్గంపేట : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో రిలే నిరహారదీక్షలను బుధవారం టిడిపి నాయకులు చేపట్టారు. బాబుకు తోడుగా మేము సైతం అనే నినాదంతో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ రిలే నిరహారదీక్షలు చేస్తున్నారు. ఈ రిలే నిరాహార దీక్షలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రేఖా బుల్లి రాజు, కొత్త కొండబాబు, వైబోగుల కొండబాబు, తదితరులు నల్ల కండువాలు ధరించి రిలే నిరాహారదీక్షలు చేశారు. గండేపల్లిలో టిడిపి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ గండేపల్లి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలను జ్యోతుల నెహ్రూ సందర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోర్పు లచ్చయ్య దొర, తదితరు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఐదు రోజుల క్రితం కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన దుబ్బాకుల మధుసూదన్‌రావు (29)రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం వైయస్సార్ బీమా పథకం కింద రూ.ఐదు లక్షలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. తక్షణ సహాయం కింద రూ.10,000 బుధవారం మండల వైకాపా నాయకుడు ఆనాల సుదర్శన్,. గ్రామ సర్పంచ్ కర్రీ చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణులు. చేతుల మీదగా మరణించిన యువకుడి తల్లికి అందజేశారు. త్వరలోనే మిగిలిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుం దని, మరణించిన యువకుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నాయకులు కల్పించారు. ఈ కార్యక్రమంలో కుతుకుడిమిల్లి వెల్ఫేర్ అసిస్టెంట్ శివ, గ్రామ పెద్దలు దున్న చిట్టిబాబు, దున్న సుబ్బారావు, దున్న మురళి తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సకాలంలో పెన్షన్లు

విశాలాంధ్ర - పి గన్నవరం : అర్హత కలిగిన పేద ప్రజలందరికీ వైకాపా ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ సకాలంలో పెన్షన్లను అందిస్తున్నారని పి గన్నవరం మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు అన్నారు. ఆయన మండలంలోని కే ఏనుగుపల్లి గ్రామ సచివాలయం వద్ద నూతనంగా వైయస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా పెన్షన్లు మంజూరైన 18 మంది లబ్ధిదారులకు పెన్షన్ల సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ డి.ఆదిబాబు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రావులపాలెం గ్రామ సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెం గ్రామంలోని 5 సచివాలయాలకు సంబంధించి రెండవ విడతగా మంజూరైన 106 వైఎస్ఆర్ పెన్షన్ కానుక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ సాక మణికుమారి ప్రసన్న కుమార్, రావులపాలెం మండలం జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, రావులపాలెం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు వెలగల సత్యనారాయణరెడ్డి, కోట శ్రీలక్ష్మి వెంకటేశ్వరరావు, కోనాల రాజ్ కుమార్, గెద్దాడ నాగేశ్వరరావు, రావులపాలెం మండల యంపిటిసి సభ్యులు కోట విజయ కుమారి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్దిదారులకు వెంటనే అందజేయాలి

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు పట్టణంలోని తీరుగూడెంలో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కోగృహాలను లబ్దిదారు లకు వెంటనే అందజేయాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీరుగూడెంలో నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో గృహాలను సీపీఎం బృందం బుధవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 16 న నిడదవోలు విచ్చేయనున్న సీఎం జగన్మోహన్ రెడ్డి పట్టణంలోని 1200మంది పేద టిడ్కో లబ్దిదారులకు వెంటనే గృహాలను అందజేయాలన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పట్టణంలోని సుమారు 12వందలమంది పేద లబ్దిదారులు లక్షల రూపాయలు అప్పులు చేసి ప్రభుత్వానికి చెల్లించారని, ఇప్పటికీ దాదాపు 5సంలు పూర్తి కావొస్తున్న నేటికి వాటిని లబ్దిదారులకు అందజేయలేదన్నారు. 16న నిడదవోలు పర్యటనకు వస్తున్న సీఎం జగన్ కు టిడ్కో లబ్దిదారులతో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గారపాటి ప్రసన్న కృష్ణ. డొంకా రమేష్ లు పాల్గొన్నారు.

టీడీపీ నిరాహారదీక్షలు

విశాలాంధ్ర-పెరవలి : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బుధవారం నిడదవోలు నియోజకవర్గం పెరవలి సెంటరులో టిడిపి శ్రేణులు నిడదవోలు నియోజకవర్గ తెలుగు దేశంపార్టీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. మాజీమంత్రి కొత్తపల్లి శ్యామ్యూల్ జవహర్ పాల్గొని సంఘీభావం తెలియజేసారు. మండల జనసేన, సీపీఐ కార్యకర్తలు సంఘీభావం తెలియజేసారు. ఈకార్యక్రమంలో అతికాల వెంకటరామకృష్ణమ్మ, భూపతిరాజు రవివర్మ, అబ్బిశెట్టి సత్తిరాజు, సలాది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో :

చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రస్వామికంగా ఉందని కాట్రేనికొన మండల తెలుగు దేశం పార్టీ మహిళ అధ్యక్షురాలు మాదే యోగేశ్వరి అన్నారు. ప్రజలు శాంతియుతంగా తమ నిరసనను తెలిపే హక్కును కూడా పోలీసులతో అణిచి వేస్తున్నారని, మహిళలపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. చంద్రబాబు పై అక్రమ కేసులు ఎత్తివేసే వరకు ప్రజా ఆందోళన చేస్తామని యోగేశ్వరి హెచ్చరించారు.

గోపాలపురంలో :

రాష్ట్ర ప్రభుత్వం సిఐడిని అడ్డు పెట్టుకొని కక్షపూరితంగా చంద్రబాబు నాయుడు ను అరెస్టు చేయించడం హేయమైన చర్య అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు అరెస్టులు నిరసిస్తూ బుధవారం మూడవరోజు రిలే నిరాహార దీక్ష స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్లో కొనసాగింది. నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని మద్దిపాటి వెంకటరాజు సందర్శించారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరావు మాట్లాడుతూ పరిపాలనలో రాజనీతిజ్ఞుడిగా అపార అనుభవంతో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అవినీతి అక్రమార్జనలో ఆరితేరిన జగన్ రెడ్డి స్వార్థ రాజకీయాల ముందు న్యాయమే గెలుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జి కిషోర్, పూడి సురేష్, బాలిన రాము, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం దీక్షలో కూర్చున్న వారికి మద్దిపాటి వెంకటరాజు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు.

రాజానగరంలో :

చంద్రబాబు అక్రమ అరెస్టు కేవలం తాత్కాలిక శునకానందం మాత్రమేనని జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్ అన్నారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని సూర్యారావు పేట లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బుధవారం చేపట్టిన బాబుతో మేము సైతం సామూహిక రిలే నిరాహారదీక్షలకు మాజీ మంత్రి కెఎస్ జవహర్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాం చిన్నబాబు, రాష్ట్ర ఎక్జిక్యూటివ్ కార్యదర్శి శిష్టా లోహిత్, జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవి,నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరాం కృష్ణ,బత్తుల వెంకటలక్ష్మి తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం దీక్షదారులకు టీడీపీ లీగల్ అధ్యక్షులు గన్ని కృష్ణా నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు,తెలుగు యువత అధ్యక్షులు కందుల బాబు రాయుడు,వంక మల్లిఖార్జున స్వామి, కొల్లం రత్నం, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో :

అధికారపక్షం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మాజీ ముఖ్యమంత్రి, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని కోనసీమ జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ మీరాన్ షరీఫ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వైసీపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడిందని అన్నారు. వైసిపి నాయకులు చంకలు బాదుకోవడమే గాని గురివింద గింజ సామెతను మర్చిపోయి. సునకానందం పొందుతున్నారన్నారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర - కాకినాడ : 2015వ సంవత్సరంలో కాకినాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామారావు పేటలోని భాను అపార్ట్ మెంట్‌లో పెండ్యాల రవిశంకర్ (40) అనే వ్యక్తి ముద్దాయి కుమార్తెతో అక్రమ సంబంధం పెట్టుకుని భాను అపార్ట్మెంట్లో కాపురం పెట్టాడనే కక్షతో రవి శంకర్‌ను కత్తితో తీవ్రంగా నరికి చంపి, అడ్డు వచ్చిన నిందితుని సొంత కుమార్తె అయిన దుర్గ భవానిని కూడా తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై మృతుడి భార్య పెండ్యాల అనంతలక్ష్మి దేవి ఇచ్చిన ఫిర్యాదు పై కాకినాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐడి చైతన్య కృష్ణ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేయగా సదరు కేసులో నేరం నిరూపణ అవ్వడంతో బుధవారం నిందితుడు పటాల నాగేశ్వరరావుకు హత్య నేరం క్రింద యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10,000ల జరిమానా ఇదే కేసులో తన స్వంత కుమార్తెను తీవ్రంగా గాయపరిచినందుకు 307 సెక్షన్ క్రింద 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ కాకినాడ మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి. కమలాదేవి తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. ఆదిత్యకుమార్ వాదించారు.

హానర్స్ విధానం గందరగోళం

విశాలాంధ్ర - కొత్తపేట : డిగ్రీ విద్యలో నూతనంగా ప్రవేశపెట్టిన హానర్స్ విధానం గందరగోళంగా ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మదన్ గుంజా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సులలో ఎక్కువ ప్రవేశాలు లేవు అనే సాకుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొన్ని కోర్సులు ఎత్తివేయడాన్ని ప్రశ్నించారు. ఏదైనా నూతన కోర్సులు ప్రవేశపెట్టినప్పుడు కొన్ని ఇబ్బందులు ఉంటాయని వాటిని అధిమించగలిగితేనే కోర్సులు ప్రవేశపెట్టాలే తప్పా కోర్సులు ప్రవేశపెట్టి ఎక్కువ మంది విద్యార్థులు లేక కోర్సు తీసివేస్తే చేరిన విద్యార్థుల పరిస్థితి ఏమిటని మండిపడ్డారు. విద్యార్థులను బలవంతంగా కళాశాలలు మార్చడం, గ్రూపులు మార్చివేయడం, ఇక్కడ ఉన్న గ్రూపులు ఎత్తివేయడం చేస్తే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టికెవి శ్రీనువాసురావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మదన్ గుంజా, మండలం కార్యదర్శి వెలుమూరి హెమంత్ కుమార్, డి కిషోర్, కె ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగు పరిశీలన

విశాలాంధ్ర - శంఖవరం : వరిసాగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి పడాల గాంధీ రైతులకు సూచించారు. నెల్లిపూడిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులతో పొలం పరిశీలన చేశారు తీసుకోవాల్సిన చర్యలపైరైతులకు సూచనలు ఇచ్చారు.ప్రయోగాత్మక పొలంలో పిలకల కత్తిరింపు,ఆకుల తొలగింపు పనులు చేశారు. వరిలోజిగురు పూసిన పసుపు రంగు అట్టలు పొలంలో అమర్చి శత్రు పురుగుల ఉధృతిని గమనించ వచ్చని వివరించారు. పొలం గట్లపై కంది సాగు అవశ్యకతను తెలిపారు. అనంతరం రైతులతో బృంద విన్యాసం చేయించి ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహయకురాలు శ్రావణి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర- గోకవరం : గోకవరం మండలం కృష్ణుని పాలెం సచివాలయం వద్ద అర్హులైన వారికి పార్టీలకతీతంగా కుల మతాలకు అతీతంగా నూతన పింఛన్లను అందజేశారు. కృష్ణుని పాలెం గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు, వైసిపి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నూతనంగా 20 మందికి కొత్తగా పెన్షన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటివరకు కృష్ణుని పాలెం సచివాలయ పరిధిలో పెన్షన్ల రూపేణా సుమారు 11 లక్షల రూపాయలు ప్రతినెల ఇస్తున్నట్టు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మండల మీడియా కన్వీనర్ అంబటి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా సుమారు రెండు లక్షల పెన్షన్లు ఈ నెలలో మంజూరు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు, మండలం మీడియా కన్వీనర్ అంబటి ప్రసన్నకుమార్, వార్డు మెంబరు పండు దొర, బాలగొండ ప్రసాద్, రంగయ్య, అంబటి బాపరాజు, బాతు బాపిరాజు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.